

సింగూరుకు మహర్దశ

సాగునీటి కాల్వలకు సిమెంట్ లైనింగ్, మరమ్మతు పనులు అతి త్వరలో ప్రారంభిస్తున్నారు. వివరాలు 10లో ▸



దత్తగిరి క్షేత్రం ముస్తాబు

బర్దీపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో దత్త జయంతి మహోత్సవాలకు ఆశ్రమం ముస్తాబవుతోంది. వివరాలు 10లో ▸



ఆహ్లాదమని వస్తే అవస్థలే..

జిల్లా కేంద్రంలోని మహబూబ్‌సాగర్ చెరువు కట్టపై సేద తీరటానికి వచ్చిన ప్రజలకు నిరాశే ఎదురవుతోంది. వివరాలు 11లో ▸

ఆయిల్‌పామ్ అంతంతే...

- సాగుకు ఆసక్తి చూపని రైతులు
- అవగాహన కల్పించడంలో ఉద్యాన వన శాఖ విఫలం
- సాగు విస్తీర్ణంలో అందుకోని నిర్దేశిత లక్ష్యాలు



జహీరాబాద్ ప్రాంతంలో సాగవుతున్న ఆయిల్‌పామ్

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : ఆయిల్‌పామ్ సాగుకు రైతులు అంతగా ఆసక్తి చూపడం లేదు. ఈ పంట సాగుపై రైతుల్లో ఉద్యానవనశాఖ విస్తృతంగా అవగాహన కల్పించడంలో విఫలం కావడంతో ఈ సాగు విస్తీర్ణం పెరగలేదు. దీంతో గతేడాది నిర్దేశించిన లక్ష్యం మేరకు విస్తీర్ణం పెరగకపోగా, ఈ సారి ఏడాది కూడా దాదాపు అదే పరిస్థితి నెలకొంది. సాధారణంగా కొత్త పంటను సాగు చేసేందుకు రైతులు తొందరగా ఆసక్తి చూపరు. తోటి రైతులు వేసుకుంటే వారిని అనుసరిస్తుంటారు. అయితే ఈ పంట సాగుతో ఉండే లాభాలు, ఇతర సౌకర్యాలపై అవగాహన కల్పించేందుకు రైతులను క్షేత్ర పరిశీలనలకు తీసుకెళ్లడం, అవగాహన తరగతులను నిర్వహించడం వంటి చర్యలు చేపట్టాలి. కానీ ఉద్యాన వన శాఖ ఇవేవీ పట్టించుకోకపోవడంతో ఆ పంట సాగు విస్తీర్ణం ఆశించిన స్థాయిలో పెరగలేదు.

లక్ష్యంలో సగం కూడా దాటని విస్తీర్ణం

జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం రెండేళ్ల క్రితం అనుమతించింది. ఇందులోభాగంగా 2023–24 ఆర్థిక ఏడాదిలో రెండు వేల ఎకరాల విస్తీర్ణంలో ఈ పంటను సాగు చేయాలని ఉద్యానవనశాఖ లక్ష్యంగా నిర్ణయించింది. కానీ జిల్లా వ్యాప్తంగా కేవలం 569 ఎకరాల్లో ఈ పంట వేసుకున్నారు. అలాగే ఈ ఆర్థిక ఏడాదిలో 3 వేల ఎకరాల్లో సాగు విస్తీర్ణం పెంచాలని లక్ష్యంగా నిర్దేశించారు. కానీ కేవలం 1,396 ఎకరాల్లో ఈ పంటకు సంబంధించిన మొక్కలు నాటుకున్నారు. అంటే నిర్దేశిత లక్ష్యంలో గతేడాది 30% లోపే విస్తీర్ణం ఉండగా, ఈసారి కనీసం 40% కూడా దాటకపోవడం గమనార్హం.

చిన్న రైతులే ఎక్కువ ముందుకొస్తున్నారు..

కొత్త పంటలు సాగు చేయాలంటే ముందుగా పెద్ద రైతులే ముందడుగు వేస్తుంటారు. కానీ ఇందుకు భిన్నంగా జిల్లాలో ఈ పంట సాగుకు చిన్న, సన్నకారు రైతులే ఎక్కువ ఆసక్తి చూపుతున్నారని ఉద్యానవనశాఖ అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలో జహీరాబాద్, మొగుడంపల్లి, న్యాల్‌కల్, కోహీర్ వంటి మండలాల్లో రైతులు ఈ పంట సాగుకు ముందుకొస్తున్నారు. అలాగే నారాయణఖేడ్ ప్రాంతంలో నారాయణఖేడ్‌తో పాటు, మనూరు, కల్హేర్ తదితర మండలాల్లో కొందరు రైతులు ఈ ఆయిల్ పామ్ మొక్కలను నాటుకున్నారు.

30 ఏళ్ల వరకు దిగుబడులు..

రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగుకు రెండేళ్ల క్రితం ప్రభుత్వం అనుమతించింది. ఓ ప్రైవేటు కంపెనీకి సంగారెడ్డి జోన్‌ను కేటాయించింది. ఆ కంపెనీ కోహీర్‌లో తన నర్సరీని ఏర్పాటు చేసి మొక్కలను పెంచుతోంది. ఈ పంట సాగు చేసేందుకు ముందుకొచ్చే రైతులకు ఈ మొక్కలను ఉచితంగా సరఫరా చేస్తోంది. అలాగే ఉద్యానవనశాఖ ద్వారా ఈ రైతులకు సబ్సిడీపై డ్రిప్ సౌకర్యం కూడా కల్పిస్తున్నారు. ఒక్కో ఎకరానికి 54 నుంచి 57 వరకు మొక్కలను అందిస్తున్నారు. నాటిన నాలుగు నుంచి ఐదేళ్లకు దిగుబడి ప్రారంభమవుతుంది. ఎనిమిదేళ్ల దాటితే పూర్తి స్థాయిలో దిగుబడి వస్తుందని ఉద్యానవనశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఇలా సుమారు 30 ఏళ్ల పాటు ఈ పంట దిగుబడి వస్తుందని చెబుతున్నారు. పంటను జిల్లాకు కేటాయించిన కంపెనీనే కొనుగోలు చేస్తుంది. కేంద్రప్రభుత్వం నిర్ణయించిన ధర మేరకు సదరు కంపెనీ రైతుల నుంచి కొనుగోలు చేస్తుంది.

రాష్ట్రంలో రాక్షస పాలన

- ప్రభుత్వంపై తిరుగుబాటు ఖాయం
- ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నిరసన చేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

సంగారెడ్డి: రాష్ట్రంలో కొనసాగుతున్న రాక్షస పాలన ఎక్కడా చూడలేదని, ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తోన్న రాష్ట్ర ప్రభుత్వంపై త్వరలోనే ప్రజలు తిరగబడతారని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు తెలంగాణ తల్లి విగ్రహ రూపురేఖల మార్పునకు వ్యతిరేకంగా నిరసిస్తూ సంగారెడ్డిలోని కలెక్టరేట్ ఎదుట ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్‌ఎస్ శ్రేణులు పాలభిషేకం చేసి ఎక్కడికక్కడ నిరసనలు వ్యక్తం చేశాయి. 'కాంగ్రెస్ తల్లి వద్దు...తెలంగాణ తల్లి ముద్దు' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ...తెలంగాణ తల్లి విగ్రహాన్ని చెరపవచ్చేమోకానీ ప్రజల గుండెల్లో నిలిచిన తెలంగాణ తల్లి రూపాన్ని మాత్రం చెరపలేరన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బీఆర్‌ఎస్ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి రాగానే రాజీవ్‌గాంధీ, ఇప్పుడున్న తెలంగాణ తల్లి విగ్రహాన్ని గాంధీభవన్‌కు పంపుతామని చెప్పారు. తెలంగాణ తల్లి విగ్రహం, వాహనాల నంబర్లు టీఎస్ నుంచి టీజీగా పేర్లు మార్చినంత మాత్రాన కేసీఆర్ ఆనవాళ్లను మరిపించడం ఎవరి తరం కాదని స్పష్టం చేశారు. హరీశ్‌రావు ఒత్తిడితోనే సగం రైతు రుణమాఫీ చేసి చేతులు దులుపుకున్నారని ఎద్దేవా చేశారు. ఆనాడు విద్యావంతులను సంప్రదించి తెలంగాణ తల్లిని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు జైపాల్‌రెడ్డి, విజేందర్‌రెడ్డి, మందుల వరలక్ష్మి, మాజీ జెడ్పీటీసీ కొండల్‌రెడ్డి, డాక్టర్ శ్రీహరి, పార్టీ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాల్లోనే పోలింగ్ కేంద్రాలు

కలెక్టర్ వల్లూరు క్రాంతి



మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి జోన్: ప్రభుత్వ భవనాల్లోనే పంచాయతీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి స్పష్టం చేశారు. ప్రభుత్వ భవనాలు అందుబాటులో లేకుంటే మాత్రమే ప్రైవేట్ భవనాల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం చేయడానికి గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలు ప్రతినిధులతో కలెక్టరేట్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ....రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో 650 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయనున్నామన్నారు. జిల్లాలో నాలుగు రెవెన్యూ డివిజన్ల పరిధిలో ప్రస్తుతం 647 గ్రామ పంచాయతీలు ఉండగా నూతనంగా ఏర్పాటైన మరో 11 గ్రామపంచాయతీలు కలుపుకొని మొత్తం 658 గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఓటరుకు రెండు కిలోమీటర్లలోపు పోలింగ్ కేంద్రం ఉండేలా చూడాలన్నారు. ఓటరు జాబితాలో అభ్యంతరాలు ఉంటే ఈ నెల 12వ తేదీ కల్లా తెలియజేయాలని జిల్లా కలెక్టర్, రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీపీవో సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ 2 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి జోన్: ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహించే గ్రూప్–2 పరీక్షలు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రూప్–2 పరీక్షల నిర్వహణపై సంగారెడ్డి కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో మంగళవారం పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, ఆరోగ్య శాఖ, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో కలసి అదనపు కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పరీక్ష నిర్వహణ కోసం 41 పరీక్ష కేంద్రాలను ఎనిమిది రూట్‌లుగా విభజించినట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి ఇన్విజిలేటర్లు, శాఖపరమైన అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ విధించనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 15,218 మంది అభ్యర్థులు గ్రూప్–2 పరీక్షలకు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. డిసెంబర్ 15వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు, డిసెంబర్ 16వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 12.30.వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు పరీక్షలు జరుగుతాయని వివరించారు.

సద్వినియోగం చేసుకోవాలి

లోక్ అదాలత్‌లపై ఎస్పీ చెన్నూరి రూపేశ్



సంగారెడ్డి జోన్: ఈ నెల 14న నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్ సూచించారు. జిల్లాలో రాజీపడటానికి అవకాశమున్న అన్ని కేసులలో ఇరువర్గాలు రాజీపడేలా వారికి అవగాహన కల్పించాలని ఆయన పేర్కొన్నారు. మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో జిల్లాలోని వివిధ పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... సైబర్ నేరాలకు సంబంధించి బాధితులు కోల్పోయిన/ హోల్డ్ చేయబడిన డబ్బు తిరిగి బాధితులకు చేరేవిధంగా సంబంధిత బ్యాంక్ అధికారులకు కోర్టు ద్వారా ఉత్తర్వులు అందించాలని సూచించారు. క్షణికావేశంలో చేసే తప్పులను సరిదిద్దుకోవడానికి లోక్–అదాలత్‌లు ఒక మంచి అవకాశమని, అనవసర గొడవలకు పోయి జీవితాలను ఇబ్బందులపాలు చేసుకోకూడదని సూచించారు.

ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

మహిళా ఉద్యోగులు తాము నిర్వర్తించే విధులతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని చెన్నూరి రూపేశ్ పేర్కొన్నారు. జిల్లా పరిషత్తు కార్యాలయంలో మహిళల ఆరోగ్య సంబంధిత సమస్యలపై యశోద హాస్పిటల్స్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...మహిళలు అన్ని రంగాల్లో మగవారితో సమానంగా విధులు నిర్వహిస్తున్నారని ఉద్యోగ, కుటుంబ పరిస్థితులరీత్యా పని ఒత్తిడికి లోనవుతూ మానసికంగా, శారీరకంగా వివిధ అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. ఇంట్లో మహిళా ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఆ కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. మహిళలు తమ ఆరోగ్య విషయమై తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఒత్తిడిని అధిగమించేందుకు యోగ, వ్యాయామం, వంటివి చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎ.సంజీవరావ్, డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.



దత్త జయంతి బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే సునీత

దత్తాచల క్షేత్రంలో ఎమ్మెల్యే సునీత పూజలు

హత్నూర(సంగారెడ్డి): మండల కేంద్రమైన హత్నూర మాధుర గ్రామ శివారులోని దత్తాచల క్షేత్రం బ్రహ్మోత్సవాలలో దత్తాత్రేయ స్వామివారిని ఎమ్మెల్యే సునీత మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి దత్తాత్రేయ స్వామి భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతకు క్షేత్రాధిపతి సభాపతి శర్మ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... దత్త జయంతి బ్రహ్మోత్సవాలకు భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేయడం అభినందనీయమన్నారు.

రోడ్ల అభివృద్ధికి నిధులివ్వండి

మంత్రి కోమటిరెడ్డికి ఎమ్మెల్యే గూడెం విజ్ఞప్తి



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే గూడెం

పటాన్‌చెరు: పటాన్‌చెరు నియోజకవర్గంలో రహదారులను విస్తరించడంతో పాటు, మరమ్మతు పనులకు నిధులు కేటాయించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కోరారు. మంగళవారం బంజారాహిల్స్‌లోని మంత్రి నివాసంలో కలసి వివిధ అంశాలపై చర్చించారు. ప్రధానంగా నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు రోడ్ల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గంలో ప్రతిష్ఠాత్మకమైన పరిశ్రమలు ఉండటంతోపాటు ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉండటంతో రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయని..దీంతో వివిధ కాలనీల ప్రజలు, ఈ ప్రాంతంలో ఉన్న ఇంజనీరింగ్ చదివే విద్యార్థులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. పటాన్‌చెరు నుంచి శంకర్‌పల్లి వరకు ఉన్న డబుల్ లైన్ రోడ్డును నాలుగు లైన్లుగా విస్తరించాలని ఇందుకోసం రూ.84 కోట్లను కేటాయించాలని కోరారు. పటాన్‌చెరు నుంచి ఇంద్రేశం, పెద్ద కంజర్ల మీదుగా బేగంపేట వరకు రహదారి విస్తరణకు రూ.56 కోట్ల నిధులు కేటాయించాలని విన్నవించారు. ఎమ్మెల్యే అభ్యర్థన పట్ల సానుకూలంగా స్పందించిన మంత్రి కోమటిరెడ్డి త్వరలోనే రహదారుల అభివృద్ధి మరమ్మతులకు నిధులు కేటాయిస్తామని హామీనిచ్చారు.

ముగిసిన ఓటరు నమోదు

ఎమ్మెల్సీ ఎన్నికల కోసం రెండోసారి అవకాశమిచ్చిన ఎస్ఈసీ

- గత నెల 23న ముసాయిదా జాబితా
- ఉమ్మడి మెదక్‌లో 7,004 దరఖాస్తులు
- ఈ నెలాఖరులో తుది జాబితా
- పెరగనున్న ఓటర్ల సంఖ్య



సంగారెడ్డి జోన్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు మరోసారి కల్పించిన ఓటరు నమోదు అవకాశం సోమవారంతో ముగిసింది. ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలతో కూడిన ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు అర్హులైన వారి నుంచి సెప్టెంబర్ 30 నుంచి నవంబర్ 6 వరకు దరఖాస్తులు స్వీకరించారు. గత నెల 23న ముసాయిదా జాబితా విడుదల చేసి, అభ్యంతరాల స్వీకరణతోపాటు, ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేందుకు మరో అవకాశాన్ని కల్పించింది. ఈ మేరకు పట్టభద్రులతో పాటు ఉపాధ్యాయులు దరఖాస్తులు చేసుకున్నారు.

ఉమ్మడి జిల్లాలో 7,004 దరఖాస్తులు

ఎమ్మెల్సీ స్థానాలకు ఓటు వేసేందుకు దరఖాస్తు సమయం ముగిసిన తర్వాత ఈ నెల 9 వరకు మరో అవకాశం కల్పించగా... ఉమ్మడి జిల్లాలో 71 మండలాల్లో 7,004 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 66,975 మంది ఓటర్లతో కూడిన ముసాయిదా జాబితాను ఇప్పటికే విడుదల చేశారు. మరో అవకాశం కల్పించటంతో ఆయా జిల్లాల్లో 844మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోగా, 5,256 మంది పట్టభద్రులు దరఖాస్తు చేసుకున్నారు. సిద్దిపేటలో 2,545 మంది పట్టభద్రులు దరఖాస్తు చేసుకున్నారు. ఉపాధ్యాయులలో సంగారెడ్డి జిల్లాలో అత్యధికంగా 879 మంది దరఖాస్తు చేసుకున్నారు. ముసాయిదా జాబితాలో కంటే ఓటర్ల సంఖ్య పెరగనుంది. 2021 నాటికి డిగ్రీ పూర్తి చేసుకున్న వారు తమ ఓటు హక్కు నమోదు చేసుకునేందుకు పట్టభద్రులు ఆసక్తి కనబర్చారు.

మార్చి 29తో ముగియనున్న పదవీకాలం

నాలుగు జిల్లాలతో కూడిన ఉపాధ్యాయ శాసన మండలి నియోజకవర్గ స్థానంతోపాటు, పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గ స్థానం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రస్తుత ఎమ్మెల్సీ సభ్యుల కాలపరిమితి 2025 మార్చి 29 నాటితో ముగియనుంది.

30న తుది ఓటరు జాబితా

ఈ నెల 30న తుది ఓటరు తుది జాబితాను విడుదల చేయనున్నారు. ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేసిన నాటి నుంచి డిసెంబర్ 9 వరకు ఓటరు జాబితాపై అభ్యంతరాలను స్వీకరించారు. వచ్చిన అభ్యంతరాలను పరిష్కరించి డిసెంబర్ 30న తుది ఓటరు జాబితాను ఎన్నికల కమిషన్ ప్రకటించనుంది.

డుమ్మా టీచర్లకు చెక్

- పాఠశాలలో టీచర్ల ఫొటో, వివరాల ప్రదర్శన
- నకిలీ టీచర్ల నివారణకు సర్కారు చర్యలు
- మారుమూల బడులకు మహర్దశ !



నారాయణఖేడ్: విధులకు డుమ్మాలు కొట్టే టీచర్లు, తమకు బదులుగా ఇంకొకరిని నియమించి పనికానిచ్చే మాస్టర్ల ఆటలు సాగనివ్వకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంది. విద్యా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తున్న ప్రభుత్వం ఇక నుంచి పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఫొటోలు, వారి వివరాలు ప్రదర్శించేలా తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఏ పాఠశాలలో ఏ ఉపాధ్యాయుడు, ఎందరు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారనే వివరాలు ఆయా గ్రామాల వారికి తెలిసిపోతుంది. దీంతో సదరు ఉపాధ్యాయులు విధులకు గైర్హాజరు అయిన పక్షంలో ఆ సమాచారం గ్రామస్తులు తెలుసుకునే అవకాశం కలుగుతుంది. ఆయా పాఠశాలలకు తనిఖీకి వెళ్లిన అధికారులు, నాయకులకు సైతం సదరు పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయుల వివరాలు తెలిసిపోతాయి. జిల్లాలో మొత్తం స్కూల్ కాంప్లెక్స్‌లు 85 ఉండగా ప్రాథమిక పాఠశాలలు 863, ప్రాథమికోన్నత పాఠశాలలు 191, ఉన్నత పాఠశాలలు 211 ఉన్నాయి. మొత్తం ఉపాధ్యాయులు 5,278 మంది జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఇందులో ఇటీవల నూతనంగా జాయిన్ అయిన ఉపాధ్యాయులు 415మంది.

బడుల్లో టీచర్ల వివరాల డిస్‌ప్లే..

రాష్ట్రంలోని అన్ని సర్కారు బడుల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల ఫొటోలు, వారి వివరాలు తాము విధులు నిర్వర్తిస్తున్న పాఠశాలల్లో ప్రదర్శించాలంటూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో అక్కడక్కా ఉపాధ్యాయులు కొందరు తమకు బదులుగా ఇతరులను నియమించి వారికి రూ.5వేల నుంచి రూ.10వేల వరకు చెల్లిస్తూ తమ విధులను కొనసాగించారనే ఆరోపణలున్నాయి. జిల్లాలోని మారుమూల నారాయణఖేడ్ ప్రాంతంలో గతంలో ఇలాంటి ఘటనలు బయటపడ్డాయి. తాము విధులు నిర్వర్తించకున్నా నిర్వర్తించినట్లు పూర్తి వేతనం తీసుకుంటూ తమ స్థానంలో ఇతరులతో పనికానిచ్చేస్తున్నారు. ఇలాంటి సంఘటనల దృష్ట్యా నకిలీ టీచర్ల బెడద అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. కొందరు డుమ్మా టీచర్ల కారణంగా సక్రమంగా విధులు నిర్వర్తించే ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోనే నారాయణఖేడ్ ప్రాంతం మారుమూలగా ఉంది. ఇందులో కంగ్టి, నాగల్‌గిద్ద, మనూరు, సిర్గాపూర్ మండలాల్లోని చాలా గ్రామాల్లోని పాఠశాలలకు ఉపాధ్యాయులు సక్రమంగా రావడంలేదనే ఫిర్యాదులు తరచూ జిల్లా అధికారులకు వెళ్తుంటాయి. దీంతోపాటు జహీరాబాద్, అందోల్ నియోజకవర్గాల్లోని మారుమూల మండలాల్లోని పాఠశాలల్లోనూ ఇలాంటి సమస్యలే ఉత్పన్నమవుతున్నాయి. ఉపాధ్యాయుడి పూర్తి వివరాల ప్రదర్శనతో ఇటువంటి సమస్యల పరిష్కారానికి టీచర్ స్థానంలో ఇతరులు వచ్చిన పక్షంలో విద్యార్థులకు, తర్వాత గ్రామస్తులకు వెనువెంటనే తెలిసిపోతుంది. ఫలితంగా డుమ్మా టీచర్ల ఆట కట్టించవచ్చు.

న్యూస్‌రీల్

వృక్షశాస్త్ర అధ్యాపకురాలికి డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ సాధించిన మల్లికను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర విభాగ అధిపతిగా పని చేస్తున్న మల్లికకు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. ఈ మేరకు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీలోని ప్రొఫెసర్ శైలజ పర్యవేక్షణలో జరిగిన ''ఫైటో కెమికల్ యాంటీ ఆక్సిడెంట్ – యాంటీ బ్యాక్టీరియల్ స్టడీస్ ఆన్ సెల్టిస్ టిమర్ సిస్ అండ్ ఇంపార్టెంట్ మెడిసినల్ ప్లాంట్''అనే టాపిక్‌పై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వెల్లడించారు. కళాశాల అధ్యాపకురాలు డాక్టరేట్ సాధించడంపై కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు హర్షం వ్యక్తం చేసి, సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకురాలు ప్రవీణ, డాక్టర్ ఎస్.యోగిబాబు, అధ్యాపకురాలు పూనమ్ కుమారి, ఆర్.శివదీప్తి, డాక్టర్ ఎస్.బేబీ రమణి పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

సంక్షేమ శాఖ అధికారి లలితకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న లలితకుమారి

ఝరాసంగం(జహీరాబాద్): క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని, అందుకే అందరూ ఆటలు ఆడాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి లలితకుమారి పేర్కొన్నారు. మండల కేంద్రమైన ఝరాసంగంలో సీఎం కప్ –2024 క్రీడల్లో భాగంగా మంగళవారం మండల స్థాయి క్రీడలను ప్రారంభమయ్యాయి. మండల స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో రాణించాలని ఆమె క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్, మాజీ ఎంపీపీ హన్మంత్‌రావు పాటిల్, ఎంపీటీసీల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు శంకర్‌పాటిల్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్‌జీటీలకూ ఓటు హక్కు

ఎస్‌జీటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల డిమాండ్



సభ్యత్వం ఇస్తున్న ఎస్‌జీటీ యూనియన్ ప్రధాన కార్యదర్శి కిష్టయ్య

జహీరాబాద్ టౌన్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు ఓటు హక్కు కల్పించాలని ఎస్‌జీటీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల కిష్టయ్య డిమాండ్ చేశారు. జహీరాబాద్ మండలంలోని రాయిపల్లి, హుగ్గెల్లి, రంజోల్, భరత్‌నగర్, అల్గోల్ తదితర పాఠశాలలో మంగళవారం ఎస్‌జీటీ యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన సంఘాలు ఎస్‌జీటీలను చులకనగా చూస్తున్నాయని వాపోయారు. యూనియన్‌ను బలోపేతం చేసేందుకు ప్రతీ ఒక్కరు ఎస్‌జీటీ యూనియన్‌లో సభ్యత్వం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు విశ్వనాథ్, షకీల్, వినయ్ పాటిల్, దయాకర్, సుకుమార్, కిషన్, శివకుమార్‌లు పాల్గొన్నారు.

మానవ హక్కులను కాపాడే బాధ్యత మనదే

జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రమేశ్



మాట్లాడుతున్న రమేశ్

సంగారెడ్డి టౌన్: మానవ హక్కులను కాపాడే బాధ్యత మనందరిపై ఉందని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రమేశ్ అన్నారు. మంగళవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా మెడ్విన్ కార్యాలయంలో మన్‌ఫోర్ట్ సోషల్ ఇన్‌స్టిట్యూట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనిచేసే ప్రదేశాలలో వేధింపులకు గురిచేసిన వారిపై చర్యలు తీసుకోవడానికి ప్రత్యేక చట్టాలు ఉన్నాయని, వాటిని ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం పిల్లలకు ఉచిత బట్టలు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ మధుసుధన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వాల్టా చట్టానికి తూట్లు

ఇష్టారాజ్యంగా చెట్ల నరికివేత



నరికి డంప్ చేసిన చెట్లు

అక్కన్నపేట(హుస్నాబాద్): వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ చెట్లను తెగ నరికేస్తున్నా అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు కన్నెత్తి చూడడం లేదు. అక్కన్నపేట మండల కేంద్రం లోని బూరుగుమైసమ్మ సాక్షిగా పచ్చని వృక్షాలను నరికి డంప్ చేస్తున్నారు. అక్కడి నుంచి గుట్టుచప్పుడు కాకుండా రాత్రికి రాత్రే ఇతర పట్టణాలకు తరలిస్తూ రెండు చేతులా సంపాదిస్తున్నారు. మండల కేంద్రానికి చెందిన ఓ కలప వ్యాపారి దర్జాగా చెట్లను నరికి వేస్తూ ఇతర ప్రాంతాల్లో డంప్ చేస్తున్నాడని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి కలప వ్యాపారిని పట్టుకొని చర్యలు తీసుకోవాలని స్థానికులు, రైతులు డిమాండ్ చేస్తున్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ప్రేమ పెళ్లి



పెళ్లి చేసుకున్న ప్రేమజంట

అల్లాదుర్గం(మెదక్): ప్రేమికుల పెళ్లికి కుటుంబీకులు అడ్డు చెప్పడంతో పోలీసులను ఆశ్రయించగా మంగళవారం అల్లాదుర్గం పోలీస్‌స్టేషన్ లోనే వివాహం జరిపించారు. వివరాల్లోకి వెళ్తే.. అల్లాదుర్గం పట్టణానికి చెందిన ఎనుగండ్ల నరేశ్, అదే గ్రామానికి చెందిన లావణ్య మూడేళ్లుగా ప్రేమించుకున్నారు. అమ్మాయి తల్లిదండ్రులు వీరి వివాహానికి అంగీకరించలేదు. అబ్బాయి తల్లిదండ్రులతో కలిసి ప్రేమ జంట అల్లాదుర్గం పోలీసులను ఆశ్రయించారు. దీంతో ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి ప్రేమజంటకు కౌన్సిలింగ్ ఇవ్వగా తాము పెళ్లి చేసుకుంటామని స్పష్టం చేశారు. అబ్బాయి తల్లిదండ్రులతో కలిసి ఎస్‌ఐ సమక్షంలో ఇద్దరికీ వివాహం జరిపించారు.

అగ్ని ప్రమాదంలో రూ.2 లక్షల ఆస్తి నష్టం



కాలిపోయిన నగదు, సామగ్రి

అల్లాదుర్గం(మెదక్): ఓ ఇంట్లో అగ్ని ప్రమాదం జరిగి రూ.2 లక్షల ఆస్తి నష్టం జరిగిన ఘటన అల్లాదుర్గం మండల పరిధిలోని ఐబీ(నడిమితండా) గిరిజన తండాలో మంగళవారం చోటు చేసుకుంది. తండా వాసుల కథనం మేరకు.. తండాకు చెందిన దేవసోత్ విఠిబాయి, కవిత వ్యవసాయ పనులకు వెళ్లారు. మధ్యాహ్న సమయంలో ఇంట్లోంచి పొగలు, మంటలు రావడంతో తండావాసులు గమనించి సమాచారం ఇచ్చారు. బాధితులు ఇంటికి చేరుకొని చూడగా బీరువాలో ఉంచిన రూ.1.50 లక్షలతోపాటు విలువైన పత్రాలు, రూ.50 వేల విలువైన సామగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. ఇటీవల వరి ధాన్యం విక్రయించగా వచ్చిన డబ్బులు ప్రమాదంలో కాలిపోవడంతో బాధితులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

స్తంభాన్ని ఢీకొట్టిన కారు



నారాయణఖేడ్: ఖేడ్ పట్టణంలోని కరసగుత్తి రోడ్డులో కారు అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. మంగళవారం తెల్లవారుజామున ఘటన జరుగగా ఆ సమయంలో వాహనాల రాకపోకలు, జన సంచారం లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం దెబ్బతినగా, స్తంభం విరిగి పడింది. దీంతో పలు కాలనీలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ట్రాన్స్‌కో అధికారులు స్తంభాన్ని ఏర్పాటుచేసి కరెంట్ సరఫరాను పునరుద్ధరించారు.

సింగూరుకు మహర్దశ



కాల్వలకు సిమెంట్ లైనింగ్

- రూ.168.30 కోట్లు విడుదల
- టెండర్ల ప్రక్రియ మరూ
- మంత్రి దామోదరతో త్వరలో పనులు ప్రారంభం
- యాసంగికి సాగునీరు విడుదల చేయని అధికారులు

పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టుకు మహర్దశ రానే వచ్చింది. సాగునీటి కాల్వలకు సిమెంట్ లైనింగ్, మరమ్మతు పనులు త్వరలో ప్రారంభిస్తుండటంతో రైతుల పంటలకు నీళ్లు విడుదల చేయడానికి సులభం కానుంది. పదేళ్ల కిందట నిర్మించిన కాల్వలు కావడంతో ప్రస్తుతం పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. దీంతో నీటి ప్రవాహ వేగం తగ్గి చివరి ఆయకట్టుకు నీరందక రైతులు ఇబ్బంది పడేవారు. ఈ నేపథ్యంలో మరమ్మతులకు గాను ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో త్వరలో పనులు చేపట్టనున్నారు.

రూ.168.30 కోట్లు విడుదల

కాల్వల సిమెంట్ లైనింగ్, మరమ్మతుల కోసం నీటి పారుదల శాఖ ఫిబ్రవరి 8న ప్రతిపాదనలు పంపగా జూన్7న ప్రభుత్వం రూ.168.30 కోట్ల నిధులు మంజూరు చేస్తూ జీఓ నంబర్ 150 ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం టెండర్ల ప్రక్రియలో ఉందని అధికారులు తెలిపారు.

యాసంగికి నీళ్లు లేనట్లే..

కాల్వల మర్మతుల నేపథ్యంలో యాసంగికి సాగునీరు విడుదల చేయడం లేదు. సాగు నీరు విడుదల చేస్తే మరమ్మతులకు ఆటంకం ఏర్పడుతుంది. కాబట్టి యాసంగికి పంటకు నీరు విడుదల చేయకుండా క్రాప్ హాలిడే ప్రకటించారు. సింగూరు కాల్వల ద్వారా పదేళ్ల నుంచి రైతులు రెండు పంటలు పండిస్తున్నారు. ఈ నీటితోనే పంటలు పండించడం ఇక్కడి రైతులు అలవాటు చేసుకున్నారు. ఈసారి నీరు విడుదల చేయడం లేదని రైతులకు అధికారులు, ప్రజాప్రతినిధులు అవగాహన కల్పిస్తున్నారు.

నిండిపోయిన పిచ్చిమొక్కలు

సింగూరు ప్రాజెక్టు కాల్వలు పదేళ్ల కిందట నిర్మించడంతో ప్రస్తుతం పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. దీంతో కాల్వల్లో నీటి ప్రవాహ వేగం తగ్గి చివరి ఆయకట్టు రైతులకు నీరందడం లేదు. పదేళ్ల నుంచి ఎలాంటి మరమ్మతులు చేయకపోవడంతో కాల్వలు అస్తవ్యస్తంగా మారాయి. రెండేళ్ల నుంచి ఇసోజిపేట వద్ద కాల్వ కొట్టుపోతుంది. దీంతో దిగువన పంటలు మునిగిపోవడంతో రైతులు ఆందోళన చెందారు.

బహుళ ప్రయోజనాలు..

కాల్వలకు సిమెంట్ లైనింగ్ చేస్తే బహుళ ప్రయోజనాలు ఉన్నాయి. కుడి, ఎడమ ప్రధాన కాల్వలు 60 కిలో మీటర్లు, డైవర్షన్ కెనాల్‌లు మరో 150 కిలో మీటర్లు మరమ్మతు చేస్తే 40 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందుతుంది. అందోల్, పుల్‌కల్, చౌటకూర్, సదాశివపేట మండలాల్లో 114 చెరువులకు నీటి సరఫరా సాఫీగా జరిగి చెరువు కింది ఆయకట్టు కూడా పెరుగుతుందని అధికారులు తెలిపారు. మంత్రి దామోదర రాజనర్సింహ ఇటీవలె సింగూరు పర్యటించి సిమెంట్ లైనింగ్ పనుల మరమ్మతులకు శిలా ఫలకం వేసే స్థలాన్ని, రైతులతో ఏర్పాటు చేసే సమావేశ స్థలాన్ని పరిశీలించారు.

బోర్లతో సాగు చేయాలి



సింగూరు కాల్వలకు సిమెంట్ లైనింగ్ చేయడానికి మంత్రి దామోదర రాజనర్సింహ నిధులు తేవడంతో పనులు ప్రారంభమవుతున్నాయి. యాసంగికి నీరు విడుదల చేస్తే పనులకు ఆటంకం ఏర్పడుతుంది. మంత్రి సూచనల మేరకు ఈసారి నీటిని విడుదల చేయడం లేదు. బోర్లతోనే రైతులు పంటలు సాగు చేసుకోవాలని సూచనలు చేస్తున్నాం.

– ఎం.దుర్గారెడ్డి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్

సహకారం అందిస్తాం



సింగూరు పంట కాల్వలకు సిమెంట్ లైనింగ్ చేస్తే నీటి వృథాను అరికట్టవచ్చు. నీటి ఆవిరి తగ్గుతుంది. ఫలితంగా మరిన్ని ఎకరాలకు నీరు పారించవచ్చు. అందుకు ఆయకట్టు రైతులం అధికారులకు సహకరిస్తాం. రైతులకు అవగాహన కల్పించి మరమ్మతు పూర్తయ్యే వరకు సహకారం అందిస్తాం.

– ఆర్.రాంచంద్రారెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్



పిచ్చి మొక్కలతో సింగూరు సాగు నీటి కాల్వ

దత్తగిరి క్షేత్రం ముస్తాబు

3 రోజులు 21 యజ్ఞగుండాలతో హోమం

విద్యుత్ దీపాలతో ఆశ్రమం అలంకరణ ● తరలిరానున్న భక్తజనం



విద్యుత్ దీపాల అలంకరణలో దత్తగిరి క్షేత్రం

ఝరాసంగం(జహీరాబాద్): జిల్లాలో ఆధ్యాత్మిక క్షేత్రంగా బాసిల్లుతున్న బర్దీపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో దత్త జయంతి మహోత్సవాలకు ఆశ్రమం ముస్తాబవుతోంది. ఆశ్రమ పీఠాధిపతులు 108 వైరాగ్య శిఖామని అవధూత గిరి మహారాజ్, డాక్టర్ సిద్దేశ్వర స్వాముల ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం దత్త జయంతి మహోత్సవ కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఆశ్రమానికి తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. 8న శిఖర పూజతో దత్త జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రతిరోజూ దత్తాత్రేయ పాదపూజ, గోపూజ, సప్త భజన, గురు చరిత్ర పారాయణము తదితర పూజా కార్యక్రమాలు కొనసాగుతుతాయి.

21 యజ్ఞ గుండాలతో హోమం

మహోత్సవాల్లో భాగంగా 13, 14, 15వ తేదీల్లో మూడు రోజులపాటు 21 యజ్ఞ గుండాలతో శ్రీ దత్తాత్రేయ హోమం నిర్వహించనున్నారు. నిత్య పూజలతోపాటు దత్తాత్రేయ హోమం, పూర్ణాహుతి, మహా మంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు.

15న దత్త జయంతి వేడుకలు

15న దత్తాత్రేయ జయంతిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేస్తారు. హోమం, దత్తాత్రేయుడి డోలారోహణం, దత్త దీక్ష విరమణతోపాటు నిత్య పూజలు ఉంటాయి. సాయంత్రం 6 గంటలకు 21,600 దీపారాధన, హారతి కార్యక్రమం నిర్వహించనున్నారు. అనంతరం ఆధ్యాత్మిక సభలు ఉంటాయి. 17న ముగింపు సందర్భంగా దత్తగిరి మహారాజ్ అమర తిథి సందర్భంగా ఏకాదశ రుద్రాభిషేకం, పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆశ్రమాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలు, పూలతో అలంకరించారు.

హాజరుకానున్న మంత్రులు

దత్తాత్రేయ జయంతిని పురస్కరించుకొని 20న మంత్రి దామోదర రాజనర్సింహ, కేంద్ర రసాయనాలు ఎరువుల శాఖ సహాయ మంత్రి భగవత్ కుబతోపాటు ఎమ్మెల్యేలు ప్రజా ప్రతినిధులు హాజరు కానున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జైలు, జరిమానాలు



గజ్వేల్‌రూరల్: మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళీ పేర్కొన్నారు. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల నిర్వహించిన వాహనాల తనిఖీల్లో 18 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారని తెలిపారు. వారిని మంగళవారం గజ్వేల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక ఎదుట హాజరు పర్చగా విచారణ అనంతరం 18 మందికి రూ.11,500 జరిమానా విధించినట్లు తెలిపారు.

వ్యక్తికి జైలు

మద్దూరు(హుస్నాబాద్): మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి ఏడు రోజులు జైలు శిక్ష పడినట్లు మద్దూరు ఎస్‌ఐ షేక్ మహబూబ్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం మేకలగట్టు గ్రామానికి చెందిన ఇస్లావత్ మధు గతంలో మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. కేసులో భాగంగా మంగళవారం హుస్నాబాద్ జేఎఫ్‌సీఎమ్ కోర్టు మెజిస్ట్రేట్ జైలు శిక్ష విధించారు.

ఒకేసారి పది మందికి..

కోహెడ(హుస్నాబాద్): మద్యం సేవించి వాహనాలు నడిపిన రామగిరి మండలం కలవచర్ల గ్రామనకి చెందిన చింతల అనిల్, కోహెడ మండలం కాచాపూర్ గ్రామానికి చెందిన జేరి పోతుల ఎల్లయ్యకు 7 రోజులు జైలు శిక్ష, మరో ఎనిమిది మందికి కలిపి రూ.12 వేలు జరిమానాను విధిస్తూ హుస్నాబాద్ న్యాయమూర్తి క్రిష్ణ తేజ్ తీర్పునిచ్చినట్లు ఎస్‌ఐ అభిలాష్ తెలిపారు. వాహనాలు తనిఖీల్లో పట్టుపడి పది మందిని మంగళవారం కోర్టుకు తరలించినట్లు పేర్కొన్నారు.

పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో..

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్ లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా, జైలు శిక్ష విధించిన ఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ కథనం మేరకు.. సోమవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 11 మందిని పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన వారిని మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఇద్దరికి రూ.2 వేలు, ఆరుగురికి రూ.1,500, మరో ముగ్గురికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు. ఎవరైన తాగి వాహనాలు నడిపితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నీటి కుంటలో పడి వ్యక్తి మృతి

సిద్దిపేటరూరల్: నీటి కుంటలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని ఇర్కోడు గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై అపూర్వ రెడ్డి కథనం మేరకు.. గ్రామానికి చెందిన మారెడ్డి కొండల్ రెడ్డి (52) నాలుగేళ్లుగా కుటుంబంతో హైదరాబాద్‌లో ఉంటున్నారు. 3వ తేదీన సిద్దిపేటలో ఇంటి కొచ్చాడు. సోమవారం ఇర్కోడులో ఉన్న అమ్మ దగ్గరికి వెళ్తున్నానని భార్య సుజాతకు ఫోన్ చేసి చెప్పాడు. సాయంత్రం సుజాత ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో ఆమె తమ్ముడు నర్సింహారెడ్డికి ఫోన్ చేసింది. నర్సింహారెడ్డి గ్రామానికి వచ్చి వెతుకుతుండగా నీటి కుంటలో పడి చనిపోయి ఉన్నాడు. భర్త మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ మంగళవారం భార్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఫిట్స్‌తో కిందపడి లారీ క్లీనర్..



గణపతి మృతదేహం

చేగుంట (తూప్రాన్): ఫిట్స్‌తో కిందపడి లారీ డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని వడియారం శివారులో భజరంగ్ ధర్మకాంట వద్ద మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి కథనం మేరకు.. కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లాకు చెందిన గణపతి నానాపూర్ (38) లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. లారీలో వరి పొట్టును లోడు చేసుకోవడానికి వచ్చి వడియారం శివారులో నిలుపగా ఫిట్స్ వచ్చి కింద పడిపోయాడు. వెంటనే రామాయంపేట ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య అరుణ ఫిర్యాదు పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

కొండపాక(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుకునూరుపల్లి ఎస్సై కథనం మేరకు.. కుకునూరుపల్లి గ్రామానికి చెందిన ఈగ స్వామి(40) కుటుంబీకులు బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లారు. 7న కొమురవెల్లి మండలంలోని తపాస్‌పల్లి గ్రామంలో బంధువుల ఇంట్లో శుభకార్యానికి హైదరాబాద్ నుంచి స్కూటీపై వచ్చాడు. అదే రోజు సాయంత్రం తిరుగు ప్రయాణంలో కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్ సమీపంలో రాజీవ్ రహదారి డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాలు కాగా గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ..



పెంటమ్మ (ఫైల్)

వట్‌పల్లి(అందోల్): బస్సు ప్రమాదంలో గాయపడిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే.. అందోలు మండల పరిధిలోని అన్నాసాగర్ గ్రామానికి చెందిన ఎరుకల పెంటమ్మ సోమవారం ఆర్టీసీ బస్సు ఎక్కుతుండగా డ్రైవర్ బస్సును ముందుకు తీయడంతో ఆమె కాలుపై నుంచి వెళ్లిన విషయం తెలిసిందే. గాయపడిన పెంటమ్మను జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ పాండు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించిన సమయంలో సరైన వైద్య సేవలు అందించకపోవడంతోనే పెంటమ్మ మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆరోపించారు.

పురుగుల మందు తాగిన మహిళ..

దుబ్బాకటౌన్: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. మంగళవారం దుబ్బాక ఎస్సై గంగరాజు కథనం మేరకు.. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేట 7 వార్డుకు చెందిన దివిటి సరస్వతీ (53) భర్తతో విడాకులు తీసుకోగా, పెళ్లియిన కుమార్తె సైతం అనారోగ్యంతో మరణించింది. కొంతకాలంగా కూలీ పని చేస్తూ ఒంటరిగా జీవిస్తుంది. సోమవారం అదే వార్డులో నివాసముంటున్న తమ్ముడి ఇంటికెళ్లి తనకు బతకాలని లేదని, ఒంటరిగా ఉండడం కన్న చావడం మేలని తీవ్ర మానసిక వేదనకు గురైంది. అనంతరం అద్దె ఇంటికెళ్లి పురుగుల మందు తాగింది. వెంటనే ఇంటి యజమాని తమ్ముడికి సమాచారం ఇచ్చి సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందింది. మృతురాలి సోదరుడు గణేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

76 మంది కానిస్టేబుళ్ల బదిలీ

సిద్దిపేటకమాన్: సిద్దిపేట పోలీసు కమిషనరేట్ పరిధిలో భారీగా కానిస్టేబుళ్లు బదిలీ అయ్యారు. పలు పోలీసు స్టేషన్‌లలో విధులు నిర్వహిస్తున్న 76 మందిని ఇతర పీఎస్‌లకు బదిలీ చేస్తూ సీపీ అనురాధ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న పీఎస్‌ల నుంచి రిలీవ్ అయిన అనంతరం వారికి కేటాయించిన పోలీసు స్టేషన్‌లలో విధుల్లో చేరనున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

సిద్దిపేటకమాన్: తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడిన ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. సిద్దిపేట టూటౌన్ పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని బృందావన్ కాలనీకి చెందిన కె.అభినవ్ వ్యాపారం చేస్తూ హైదరాబాద్‌లో ఉంటున్నాడు. కాలనీలోని ఇంట్లో తల్లి ఒంటరిగా ఉంటుంది. తల్లి అనారోగ్యంగా ఉండటంతో 3న చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లాడు. ఆస్పత్రిలో చికిత్స చేయించి తన అక్క ఇంటి వద్ద ఉంచాడు. అభినవ్ మంగళవారం సిద్దిపేటలోని తన ఇంటికొచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న 8 తులాల బంగారం, 500 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.లక్ష నగదును గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. దీంతో బాధితుడు సిద్దిపేట టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బీఎస్సీ విద్యార్థిని అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: బీఎస్సీ విద్యార్థిని అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ కోటేశ్వర్‌రావు కథనం మేరకు.. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఓ కాలనీకి చెందిన లచ్చయ్య మనవరాలు రాణి (22) బీఎస్సీ చదువుతుంది. 9న ఇంటి నుంచి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించ లేదు. మనవరాలు అదృశ్యంపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య



శ్రీధర్ (ఫైల్)

హుస్నాబాద్‌రూరల్: ఆర్థిక ఇబ్బందులతో ఆటో డ్రైవర్ ఉరి వేసుకొని ఆత్మహత్య పాల్పడ్డాడు. ఈ ఘటన హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బండి శ్రీధర్(28) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆరు నెలల నుంచి ఆటో నడవకపోవడంతో ఫైనాన్స్ వాయిదాలు చెల్లించలేదు. ఇంట్లో కుమారుడికి జ్వరం రావడంతో మందులు తేవడానికి భార్య సౌమ్య షాపునకు వెళ్లింది. ఆమె తిరిగొచ్చేసరికి తలుపులు వేసుకొని శ్రీధర్ ఉరి వేసుకున్నాడు. మృతుడి భార్య సౌమ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

అప్పుల బాధతో కూలీ

దుబ్బాకటౌన్: అప్పుల బాధతో కూలీ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేట 7 వార్డులో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై గంగరాజు కథనం మేరకు.. ధర్మాజీపేట వార్డుకు చెందిన పోతిగంటి నర్సింలు(42) గ్రామంలో కూలీ పనులు చేసుకుంటూ భార్య మణెవ్వ, కొడుకు, కూతురుతో జీవిస్తున్నాడు. కూలీ పనులు సరిగ్గా దొరక్కపోగా కూతురు పెళ్లి కోసం దాదాపు రూ.4 లక్షల వరకు అప్పులు చేశాడు. చేసిన అప్పులో ఎలా తీర్చాలో తరుచూ బాధపడేవాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో గదిలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య మణెవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి..



కుమార్ (ఫైల్)

హత్నూర (సంగారెడ్డి): భార్యాభర్తల మధ్య కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన హత్నూర మండలం నస్తీపూర్ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై సుభాష్ కథనం ప్రకారం నస్తీపూర్ గ్రామానికి చెందిన గిరికల కుమార్(35) భార్య లావణ్యతో తరచూ గొడవపడేవాడు. రెండు రోజుల కిందట భార్యాభర్తల మధ్య పంచాయితీ నిర్వహించి పెద్దలు నచ్చజెప్పారు. 9వ తేదీన భార్యను లావణ్య, తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి కుమార్ పై ఫిర్యాదు చేశారు. అదే రోజు రాత్రి కుమార్ ఇంట్లో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం తల్లి శంకరమ్మ కుమారుడు లేవడం లేదని వెంటనే పక్కింటి వారిని పిలిచింది. వారు వచ్చి చూడగా ఉరేసుకొని కనిపించాడు. మృతుడి తల్లి శంకరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డబ్బులు ఇవ్వడం లేదని ఆత్మహత్యాయత్నం

ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఘటన



పురుగు మందు డబ్బాతో బాధితుడు

సిద్దిపేటరూరల్: ఐసీడీఎస్ కార్యాలయంలో పని చేస్తున్న వ్యక్తి డబ్బులు తీసుకొని ఇవ్వడం లేదని బాధితుడు మంగళవారం కార్యాలయం ఎదుట పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితుడి కథనం మేరకు.. అర్బన్ మండలం పొన్నాల గ్రామానికి చెందిన పందుల నారాయణ రియల్ ఎస్టేట్ చేస్తున్నప్పుడు ఐసీడీఎస్ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్‌లో పని చేస్తున్న లోకుల శ్రీనివాస్‌తో మూడేళ్ల కిందట పరిచయం ఏర్పడింది. నారాయణ భూమి కొనుగోలు చేస్తానని చెప్పడంతో అతడు కలెక్టరేట్ వద్ద భూమి అమ్మకానికి ఉందని చూపించాడు. రూ.9 లక్షల 80 వేలు, నాలుగు చెక్కులను శ్రీనివాస్‌కు ఇచ్చి భూ యజమానికి ఇవ్వమని చెప్పాడు. కానీ అతడు ఇవ్వలేదు. దీంతో అసలు విషయం బయటపడింది. పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టి శ్రీనివాస్‌ను పిలిపించి అడుగగా రూ.6 లక్షలు 3 నెలల వాయిదాకు ఇస్తానని కాగితం రాసిచ్చాడు. గడువు ముగిసినా ఇవ్వకపోవడంతో ఐసీడీఎస్ కార్యాలయంలో వద్దకు వచ్చి శ్రీనివాస్‌ను డబ్బులు అడుగగా ఇవ్వనంటూ బెదిరించాడు. దీంతో చేసేదేమి లేక పురుగు మందును తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. వెంటనే అప్రమత్తమైన స్థానికులు అడ్డుకున్నారు. అనంతరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో నారాయణ ఫిర్యాదు చేశారు.

ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ల నిరసన

- సిద్దిపేట డిపోలో నిలిచిన 53 బస్సులు
- చిన్న చిన్న ఫిర్యాదులకే చర్యలు తీసుకుంటున్నారని ఆవేదన



సిద్దిపేట డిపో ఎదుట నిరసన తెలుపుతున్న అద్దె బస్సు డ్రైవర్లు

సిద్దిపేటకమాన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మీ పథకం తర్వాత ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికుల రద్దీ విపరీతంగా పెరిగిందని, ఓవర్ లోడ్‌తో తమకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని.. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో అద్దె బస్సు డ్రైవర్లు నిరసన తెలిపారు. సిద్దిపేట ఆర్టీసీ డిపోలో పని చేసే అద్దె బస్సు డ్రైవర్లు మంగళవారం ఉదయం నుంచి తమ విధులు బహిష్కరించి నిరసనలో పాల్గొన్నారు. దీంతో సిద్దిపేట డిపో పరిధిలో తిరిగే 53 అద్దె బస్సు సర్వీసులు నిలిచిపోయాయి. ఆర్టీసీ బస్సులో మామూలుగా 53 మంది ప్రయాణించాలి. కానీ ఉచిత ప్రయాణ పథకం తర్వాత ఒక్కో బస్సులో పరిమితికి మించి సుమారు 110 నుంచి 120 మంది ప్రయాణికులు వెళ్తున్నారు. ఓవర్ లోడ్‌తో ఏదైనా ప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదని అద్దె బస్సు డ్రైవర్లు వాపోతున్నారు. నాలుగు రోజుల కిందట గంభీరావుపేట వద్ద ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్‌పై ప్రయాణికుడు దాడి చేశాడు. దీంతో సిబ్బంది సిద్దిపేట డిపో మేనేజర్ సుఖేందర్ రెడ్డికి ఫిర్యాదు చేయగా అధికారులు పట్టించుకోకపోవడంతో పాటు తమపై దురుసుగా ప్రవర్తిస్తున్నారని పేర్కొన్నారు. చిన్న చిన్న ఫిర్యాదులకే డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి, సీఐ మహేశ్వరీ తమను పక్కన పెడుతూ డ్యూటీలు కేటాయించడం లేదని, తమపై దురుసుగా ప్రవర్తిస్తూ వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.